క్లుప్తంగా

విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేరళలోని వయనాడ్ బాధితుల కోసం అరిణాఅక్కివలసలోని శ్యాం క్రిగ్ పిష్టన్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం విరాళాలు సేకరించారు. రూ.12,080 సేకరించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, కార్యదర్శి ఎస్.వి. రమణ తెలిపారు. చిలకపాలెంలో రూ.3,470 సేకరించామన్నారు. మరుకొద్ది రోజులు సేకరణ చేసి అక్కడి సహాయనిధికి అందజేస్తామన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ


ఆదిత్యుని జ్ఞాపికను రాజశేఖర్‌కు అందజేస్తున్న శంకరశర్మ, చక్రవర్తి తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగ ప్రిన్సిపల్ సెక్రటరీ వై.వి.జె.రాజశేఖర్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆయనకు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి గోత్రనామాలతో పూజలు జరిపించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చక్రవర్తి, వీఆర్వోలు చంద్రభూషణ్, విశ్వేశ్వరరావు ఉన్నారు.

సాగునీరు అందించాలి


కుశాలపురం సమీపంలో నారాయణపురం కుడి కాలువలో నీటి పరిస్థితి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీరు అందించాలని మాజీ జెడ్పీటీసీ సనపల నారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. సాగునీటి సమస్యను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఎచ్చెర్ల మండలంలో 13 గ్రామాలకు చెందిన 7,175 ఎకరాలున్నాయని, సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. రైతులందరూ హాజరుకావాలన్నారు.

దుర్గాప్రసాద్ పండాకు కళా రత్న అవార్డు ప్రదానం


దుర్గాప్రసాద్ పండాకు అవార్డును ప్రదానం చేస్తున్న ప్రతిభ సంస్థ సభ్యులు

గార: జానపద, ఆధ్యాత్మిక గాయకుడు దుర్గాప్రసాద్ పండాకు విశాఖపట్నానికి చెందిన ప్రతిభ సాంస్కృతిక సంస్థ ప్రతిభ గాన కళా రత్న అవార్డుతో సత్కరించింది. రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, జానపద ప్రదర్శనలు ఇచ్చారు. ఈయన కళాసేవను గుర్తించి ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసి గౌరవించారు. కార్యక్రమంలో ప్రతిభ అడవిరాజు, భాస్కర్ భట్ల, డైరెక్టర్ రవితేజ పాల్గొన్నారు.

సింగుపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు


బస్సుల రాకపోకలు పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నరసన్నపేట, టెక్కలి, పలాస, శ్రీముఖలింగం, తిమడాం, గోపాలపురం వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సు సర్వీసులలో కొన్నింటి ఉదయం ఐదు నుంచి రాత్రి 9.15 గంటల వరకూ సింగుపురం ఊరులో నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని రామలక్ష్మణ కూడలి, పెద్దపాడు, సింగుపురం తదితర ప్రాంతాల్లో పల్లెవెలుగు బస్సులు ప్రయాణికుల కోసం నిలుపుదల చేస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. సింగుపురం గ్రామ పరిసర ప్రాంత ప్రయాణికులు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘హై’వే గుబులు!


పెద్దపాడు రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో హైవేపై ఇలా..


సర్వీస్ రోడ్డులో ఓవర్ లోడ్ వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో ట్రాక్టర్‌మలుపు తిరుగుతూ..


ఫ్లైఓవర్ కింద ఇలా పార్కింగ్ చేస్తే వాహనాలు వెళ్లేది ఎలా?

హైవేపై ప్రయాణం ప్రమాదంగా ఉంది. పోలీసు అధికారులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా, అవగాహన కల్పిస్తున్నా వాహనాల డ్రైవర్లలో మార్పురావడం లేదు. ఓవర్ లోడింగ్‌తో ఉండే భారీ వాహనాలను నగర, పట్టణ, ముఖ్య కూడళ్ల సమీప హైవేల వెంబడి ఫ్లైఓవర్లపైన, దిగువున, సర్వీస్ రోడ్డులో గంటల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో కనీసం సైడ్ ఇండికేటర్ సిగ్నల్స్ కూడా కొందరు వేయకుండా వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఆ సమయంలో ప్రయాణించేవారు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాలు జరిగే ఆస్కారముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ హైవే గస్తీని ముమ్మరం చేసి ఇలాంటి వాహనాలపై పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

–శ్రీకాకుళం క్రైమ్

శున‘కాలు’ పీకేస్తున్నాయ్..

- జనాలను హడలెత్తిస్తున్న కుక్కలు
- బయటకొచ్చేందుకు భయపడుతున్న వైనం
- నియంత్రణ చర్యలు అంతంతమాత్రమే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరవాసులను కుక్కలు భయపెడుతున్నాయి. రేయింబవళ్లు విచ్చలవిడిగా జనావాసాల్లో సంచరిస్తూ ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నడిచి వెళ్లేవారి కాళ్లను పీకేస్తున్నాయి. ప్రధానంగా సాయంత్రం ఆరు గంటలు దాటితే ఇంటి నుంచి బయటకి రావాలంటే భయమేస్తోంది. ఎక్కడికక్కడ గుంపులు గుంపులుగా తిరుగుతూ భయపెడుతున్నాయి. హోటళ్లు, టిఫిన్, చికెన్, మటన్ షాపుల వద్ద పదుల సంఖ్యలో ఉంటున్నాయి. ఎవరైన వీటిని గమనించకుండా వెళ్తే వారిపై దాడి చేసి కాటు వేస్తున్నాయి. నగరంలో దాదాపుగా ఊర కుక్కలు పదివేలకు పైగా, పెంపుడు కుక్కలు అధికారిక లెక్కల ప్రకారం మూడు వేలకు పైగా ఉన్నాయి. పెంపుడు కుక్కలకయితే వాటి యజమానులు తగు జాగ్రత్తలు చేపట్టి టీకాలు వేయిస్తున్నారు. అంతే కాకుండా యాంటీరేబిస్ వంటి టీకాలు కూడా ఎప్పటికప్పుడు వేయిస్తున్నారు. కాని ఊర కుక్కలను మాత్రం నియంత్రించేవారే కరువయ్యారు. సంతానం లేకుండా చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా కుక్కల నియంత్రణ ఏమాత్రం జరగలేదని రాత్రి, పగలు విచ్చల విడిగా సంచరిస్తున్న కుక్కలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

తూతుమంత్రంగా నియంత్రణ చర్యలు

జాతీయ జంతు సంక్షేమ మండలి సంస్థ (యానిమల్ వెల్ఫేర్‌బోర్డు ఆఫ్ ఇండియా) గైడ్ లైన్స్ ప్రకార ఏబీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నగరపాలక సంస్థ నివారణ బాధ్యతలు చేపడితే కుక్కలను నియంత్రించవచ్చు. ఇటీవల కాలంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నప్పటికీ నగరంలో మాత్రం విచ్చలవిడిగా రోడ్లపై కుక్కలు తిరగడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు.


టౌన్‌హాల్ రోడ్డులో పట్టపగలే సంచరిస్తున్న కుక్కలు

నియంత్రణ చర్యలు చేపడుతున్నాం



కుక్కల నియంత్రణకు ఖాజీపేట యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా హర్యానకు చెందిన స్నెక్ ఏజెన్సీ వారు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటివరకు మూడు వేలకుపైగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టాం. వాటికి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయడం జరిగింది. వాటి క్రూరత్వాన్ని తగ్గించే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఒక్కో కుక్కను నియంత్రించేందుకు రూ. 1500 ఖర్చు చేస్తోంది. పశుసంవర్థకశాఖ, కమిషనర్, కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారులతో కమిటీ ఉంటుంది. ప్రతి నెలా సమావేశం ఏర్పాటుచేసి కార్యక్రమం మానిటరింగ్ చేస్తున్నాం. 50 కుక్కలు కెపాసిటి నుంచి 70కి కెన్నల్స్‌ను పెంచాం. మరో ఆరు నెలల్లో పూర్తిగా నియంత్రణ చేస్తాం.

–చల్ల ఓబులేసు,
కమిషనర్, శ్రీకాకుళం నగర పాలకసంస్థ


ప్రభాకర్‌నగర్‌కాలనీలో గుంపుగా ఉన్న శునకాలు

చాలా భయమేస్తోంది



సాయంత్రమయితే చాలు భయటకు వచ్చేందుకు భయమేస్తోంది. నగరంలో ద్విచక్రవాహనాలు, కార్లు, వంటివాటిపై దూకుడుగా వెలుతున్నాయి. స్కూళ్లకు, ఆఫీసులకు వెళ్లి వచ్చే సమయంలో దాడి చేస్తున్నాయి. దీంతో చాలా మంది కుక్కకాటుకి గురవుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– ఎస్.ధర్మారావు,
బావాజీనగర్, బలగరోడ్డు, శ్రీకాకుళం

వేణుగోపాలపురంలో ఉచిత వైద్య శిబిరం

గార: మండలంలోని వేణుగోపాలపురం ప్రైమరీ పాఠశాల వద్ద గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవిందాజులు ఉద్యోగ సంఘాల నేతగా ఎందరో జీవితాల్లో వెలుగులు దిద్ది ఆదర్శంగా నిలిచారన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధిలో విశేషమైన కృషి చేశారని గుర్తు చేశారు. వైద్యులు శిష్టు మనోజ్‌కుమార్, కొంక్యాన మాధురి, కె.సంగీతావాణి, దొంతం ఆదిత్య, ప్రియాంకలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రూ. 30 వేలు విలువ చేసే మందులను అందించారు.


వైద్య శిబిరంలో ఎమ్మెల్యే శంకర్, ట్రస్టు ప్రతినిధులు

ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, డైరక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దానేటి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యుడు గుండ భాస్కరరావు, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయం

శ్రీకాకుళం అర్బన్: ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని నూతన అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా రవికుమార్, సెక్రటరీగా శ్రీనివాసరావు, కోశాధికారిగా సింగూరు ప్రవీణ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. తన సేవా సంస్థ కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, రక్తదాన శిబిరాలు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, అంబులెన్స్ సేవలు అందిస్తామన్నారు. అలాగే ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, మార్చురీ ఫ్రీజర్లు, పార్థివదేహాలకు శాంతి రథలను సమకూర్చడం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పి.జగన్మోహనరావు, విశ్రాంత జాయింట్ కలెక్టర్ రజనీకాంత్, విశ్రాంత డీఎస్పీ భార్గవనాయుడు, బి.లక్ష్మణరావు, సుమతి, రెడ్డి, మానవతా స్వచ్ఛం సేవా సంస్థ చైర్మన్ డి.విష్ణుమూర్తి, సంస్థ వైస్ చైర్మన్ నటుకుల మోహన్, టూరిజం అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, టి.రాంగోపాల్ టి.అప్పలనాయుడు, కొమ్ము రమణమూర్తి, కోరాడ హరగోపాల్ ఉన్నారు.

ముగిసిన సుదర్శన యాగం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన నరసింహ సహిత మహా సుదర్శన యాగం చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతితో ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. విశ్వశాంతి సంరక్షణ కోసం, అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలనే సంకల్పంతో ఈ యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. యజ్ఞంలో మూలమంత్ర హవనం, సుదర్శన సత్రం పారాయణం, పూర్ణోక్తి, మంగళ శాసనము, రిత్విక ఆచార్య బ్రాహ్మణ సన్మానం, ప్రసాద వితరణతో కార్యక్రమం పూర్తయ్యింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రసాదరావు తదితరులు

ఎరువుల దుకాణం ప్రారంభం

జి.సిగడాం: మండలంలోని చీడిపేట-పొందూరు గ్రామాల సమీపంలో నూతన ఎరువుల దుకాణాన్ని మండల సీనియర్ నాయకుడు, న్యాయవాది పేడాడ శ్రీరామ్మూర్తి ఆదివారం ప్రారంభించారు. విజయరాంపురం గ్రామానికి చెందిన చింతాడ వెంకటరమణ, పావన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. రైతు చెంతకే ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు కంచరాన రమణారావు, పేడాడ శ్యామలరావు, పేడాడ కృష్ణంరాజు, పేడాడ నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.


ఎరువుల షాపును ప్రారంభిస్తున్న శ్రీరామ్మూర్తి

కార్మికుల సంక్షేమానికి కృషి

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని కాష్యూ, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి అన్నారు. పలాసలోని కార్మిక భవనం వద్ద కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ మంది కార్మికులు ఉన్నటువంటి సంఘాలలో పలాస జీడి కార్మికుల సంఘం మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సంఘం ఏర్పడి 47 ఏళ్ల పూర్తి చేసుకుందని అన్నారు. కార్మికులు సంక్షేమానికి ప్రభుత్వం, పరిశ్రమదారులు అందరూ సహకరించాలని కోరారు. యాజమాన్యం బాగుంటే కార్మికుడు.. కార్మికుడు బాగుంటే యాజమాన్యం బాగుంటోందన్నారు. అన్నారు. జీడి కార్మికులకు మరో తొమ్మిది నెలల్లో కొత్త వేతనం అమలవుతోందన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తించేలా, గుర్తింపు కార్డులు, కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, పూర్వ అధ్యక్షులు బొంపల్లి సింహాచలం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధ్యక్షులు కృష్ణమూర్తి

కషాయాల తయారీపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కషాయాల తయారీపై అదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్పీఎం షాప్ దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్ల యూనిట్ ఇన్‌చార్జి కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాలు వినియోగించుకోవాలని సూచించారు. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలతో పూర్తిగా తెగుళ్ల అదుపులోకి వస్తాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరిలో 15 రోజులకు ఓసారి పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగులు, కాండం తొలిచే పురుగులను ఈ కాషాయాలతో నియంత్రించవచ్చన్నారు. పురుగు మందులకు ప్రత్నామ్నాయంగా కషాయాలు పంటల్లో వాడటం వల్ల ఆరోగ్యకరమైన పంటలు లభిస్తాయని, భవితరాలు భవిష్యత్తుకు ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లీడ్ ఫార్మర్లు మీనా, తులసి, సత్యవతి, మొట్ట ధనుంజయ్, హరే రామ పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని పెదపాడు బాలికల అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో 18, ఆరోగ తరగతిలో ఎస్సీ కేటగిరీలో నాలుగు, ఏడో తరగతిలో ఎస్సీ కేటగిరీలో ఒకటి, ఎనిమిదో తరగతిలో ఎస్సీ కేటగిరీలో ఒకటి, ఎస్టీ కేటగిరీలో ఒకటి సీటు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో ప్రథమ సంవత్సరంలో ఎస్సీ కేటగిరీలో 12, ఎస్టీ కేటగిరీలో ఒకటి, బీసీ కేటగిరీలో ఒకటి, ఓసీ కేటగిరీలో ఒక సీటు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఈ నెల 13వ తేదీ ఉదయం పది గంటలకు ధ్రువపత్రాలతో పాఠశాల పని వేళలలో హాజరుకావాలని సూచించారు. సీట్లకు మించి ఎక్కువ మంది హాజరైతే ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలోని ఖాళీ సీట్ల ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు సంబంధించి ఖాళీ సీట్లుకు వచ్చిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో 10వ తరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ

రణస్థలం:

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుపతిపాలెం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా దేశ స్థాయిలో కీర్తి గాంచారన్నారు. తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమార్, మాజీ సర్పంచ్ రామునాయుడు, దళిత సంఘ నాయకులు దువ్వాన అప్పలసూరి, దేబారికి రాము, పి.ఈశ్వరరావు, దుప్పాడ కురియా బాబు తదితరులు పాల్గొన్నారు.

కొంగరాంలో గాంధీ విగ్రహావిష్కరణ..

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాం గ్రామంలో గ్రామ సచివాలయం సమీపంలో వెలిచేటి తవిటిరాజు ఏర్పాటు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. గాంధీ సూచించిన మార్గంలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ గుండ భాగ్యశ్రీ, నాయకులు పంచి రెడ్డి కృష్ణారావు, గోపిన కృష్ణప్రసాద్, బట్న లక్ష్మణరావు పాల్గొన్నారు.


రణస్థలం: అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

రణస్థలం: నేటి తరం యువత ఉపాధి అవకాశాలు ఎక్కడ ఉంటే అటువైపు పయనించాలని అప్పుడే భవిష్యత్ వైపు మార్గాలు దొరుకుతాయని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీలో గల ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ల్యాబ్ పరిశ్రమ యాజమాన్యం ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎస్ఎంటీ ఉద్యోగాలకు ఆదివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులకు డిగ్రీ ఉన్నత విద్యతోపాటు అప్రంటీస్ ట్రైనీ కాలంలో వసతి, భోజనం, ప్లాంట్‌కు రవాణ సౌకర్యంతో పాటు నెలవారీ జీతం రూ.11వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 100 మంది ఎస్ఎంటీలుగా ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎన్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి విజయకృష్ణ, కుటమి నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు ‘డబ్బీరు’ మృతి


డబ్బీరు భవానీ శంకర్ (ఫైల్)

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 16వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డబ్బీరు భవానీ శంకర్ (55) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన ఇటీవల అనారోగ్య సమస్యతో బాధపడుతూ పలాస కిడ్నీ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ తుది శ్వాస విడిచారు. భవానీ శంకర్ ప్రస్తుతం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, 16వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా, శిష్టకరణ సంఘ నాయకులుగా వ్యవహరిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఆస్పత్రికి చేరుకున్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: మైనర్లు ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేస్తే వారితోపాటు తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణ హెచ్చరించారు. ఈదుపురం, మండపల్లి కూడళ్లలో ద్విచక్ర వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు ఉండాలని సూచించారు. అనంతరం వాహనచోదకులచే రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.